క్లుప్తంగా

అన్నా కుటుంబీకులకు పరామర్శ



నివాళులర్పిస్తున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : కార్పొరేటర్ అన్నా సంధ్య కుటుంబంతో కలిసి గుంటూరుకు వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె భర్త డాక్టర్ వెంకటకిషోర్, కుమార్తె అశ్విత మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి శుక్రవారం గుంటూరులోని వెంకట కిషోర్ నివాసానికి వెళ్లి వారి భౌతికకాయాలకు నివాళులర్పించారు. అన్నా రామచంద్రయ్య, అన్నా రామకృష్ణలతో పాటు కుటుంబీకులను పరామర్శించారు.

స్విమ్స్ కార్మికుల సమావేశం

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ స్విమ్స్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీటీడీ అధికారులు, కలెక్టర్, ఎస్పీ, ఆస్పత్రి యాజమాన్యం విజ్ఞప్తి మేరకు రోగుకు ఇబ్బందులు తలెత్తకుండా కార్మికుల గతంలో చేపట్టిన సమ్మెను విరమించారన్నారు. 3 నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అక్టోబర్ 5వ తేదీకి గడువు పూర్తవుతుందని వెల్లడించారు. ఈలోపు సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేతలు మాధవ్, వేణుగోపాల్, బుజ్జి, రవి, సూరిబాబు, మారి ముత్తు, వేలు, గోపి, జయమ్మ, బాషా, జనార్ధన్, కోటయ్య పాల్గొన్నారు.

లైంగికదాడుల నివారణలో విఫలం



సుజాతమ్మ, జయంతి

తిరుపతి కల్చరల్ : మహిళలపై లైంగికదాడులను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సాయిలక్ష్మి మండిపడ్డారు. శుక్రవారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఐద్వా తిరుపతి నగర మహాసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించకపోగా 8 పని గంటలను 12 గంటలుగా పెంచడం దుర్మార్గమన్నారు. జయంతి మాట్లాడుతూ మగపిల్లలతో పోల్చుకుంటే ఆడపిల్లల నిష్పత్తి తగ్గుతోందని తెలిపారు. భ్రూణహత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అక్రమంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న స్కానింగ్ సెంటర్లపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐద్వా నగర నూతన కమిటీని ఎంపిక చేశారు. నగర అధ్యక్షులుగా ఎస్.సుజాత, కార్యదర్శిగా ఎం.జయంతి, సహాయ కార్యదర్శులుగా లత, బుజ్జమ్మ, ఉపాధ్యక్షులుగా కోమలమ్మ, గురవమ్మ ఎంపికయ్యారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

తిరుపతి అర్బన్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించింది. ఈ సమాచారాన్ని ప్రజలందరికీ నెల రోజుల పాటు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం డీఆర్వో నరసింహులతో కలసి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఆయా విభాగాలకు చెందిన అధికారులు ఏ ప్రొడక్ట్‌పై ఎంత శాతం జీఎస్టీ తగ్గింది అనే సమాచారాన్ని స్పష్టంగా చెప్పాలని పేర్కొన్నారు. గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం కేవలం రెండు శ్లాబ్‌ల్లో మాత్రమే జీఎస్టీ ఉందని వెల్లడించారు. 12 నుంచి 5 శాతానికి, 28 నుంచి 18 శాతానికి తగ్గిన క్రమంలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అధికారులతోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

చంద్రగిరి : ప్రమాదవశాత్తు డివైడర్‌ను కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి బోడంబాయి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతికి చెందిన వాసు వ్యక్తిగత పనుల నిమిత్తం తన కారులో చిత్తూరు నుంచి శుక్రవారం తిరుగు ప్రయాణమయ్యాడు. బోడంబాయి వద్ద వస్తున్న క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వాసు తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల అనుపమ్‌ఖేర్

తిరుమల : తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు శుక్రవారం సేవించుకున్నారు. వీరిలో బాలీవుడ్ నటుడు అనుపమ్‌ఖేర్ ఉన్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

సత్కారం



పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని రేణిగుంట రైల్వే స్టేషన్లో పార్టీ తిరుపతి నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయవంశీ, మల్లం రవి, వెంకటేష్ కోదండ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు.













బ్రహ్మోత్సవం.. కళా వైభవం

శ్రీవారి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. వైకుంఠనాథుని వైభవం ఇనుమడించేలా కళాకారుల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అందులో భాగంగా శుక్రవారం ఉదయం సింహవాహనసేవలో యోగనారసింహుని మహిమాన్విత చరితను జనరంజకంగా కీర్తించాయి. రాత్రి ముత్యపుపందిరి వాహనసేవలో సకల జనులను కటాక్షించి ఏడుకొండలస్వామి ప్రభను తిరుగిరులు మార్మోగేలా చాటిచెప్పాయి. శ్రీవారి భక్తులను ఆధ్యాత్మిక సంద్రంలో ఓలలాడించాయి.

– తిరుమల



శ్రీవారి భక్తులకు చిత్తశుద్ధితో సేవలు



గ్యాలరీలోని భక్తులతో మమేకమవుతున్న టీటీడీ ఈఓ

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు చిత్తశుద్ధితో సేవలందిస్తున్నట్లు టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు భక్తుల నుంచి స్వయంగా ఫీడ్ బ్యాక్ సేకరించారు. వాహన సేవ సమయంలో గ్యాలరీల్లోని భక్తుల వద్దకు వెళ్లి వారిని పలకరిస్తూ..టీటీడీ ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎలాంటి హడావుడి లేకుండా గ్యాలరీలోకి వెళ్లి భక్తులతో మాట్లాడారు. దర్శనం ఎంత సమయంలో పూర్తయ్యిందో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ అనిల్‌కుమార్‌ను పలువురు భక్తులు అభినందించారు.

తగ్గిన శ్రీవారి హుండీ ఆదాయం

తిరుమల : శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజున ఆలయ హుండీ ఆదాయం అనూహ్యంగా పడిపోయింది. టీటీడీ అధికారుల లెక్కల ప్రకారం, హుండీ ద్వారా గురువారం రూ.1.74 కోట్ల ఆదాయం వచ్చింది. బుధవారం సుమారు 58,628 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. గురువారం సుమారు 67,388 మంది సేవించుకున్నారు. బుధవారం రూ.3.01 కోట్లు రాగా గురువారం కేవలం రూ.1.74 కోట్లు రావడంపై టీటీడీ అధికారులు ఆందోళన చెందుతున్నారు. దసరా సెలవులు వచ్చినప్పటికీ తిరుమలకు తక్కువ సంఖ్యలో భక్తులు రావడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. క్రమేణా భక్తుల సంఖ్య పెరగవచ్చని భావిస్తున్నారు.

భక్తులకు మెరుగైన వైద్య సేవలు

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామని టీటీడీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నర్మద తెలిపారు. శుక్రవారం తిరుమలలోని రామ్ భగీచా–2 లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో అశ్విని ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ కుసుమ కుమారితో కలిసి ఆమె మాట్లాడారు. 50 మంది డాక్టర్లు, 60 మంది పారా మెడికల్ సిబ్బంది, 14 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. సీనియర్ సిటిజన్ల షెడ్డు వద్ద 12 పడకల ఐసీయూ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

మూడేళ్లు.. రూ.125 కోట్లు

మూడేళ్ల క్రితం మొదలైన విద్యుత్ బస్సులు ఆర్టీసీకి అదనపు ఆకర్షణగా సేవలందిస్తున్నాయి. ఏటా రూ.కోట్లు ఆర్జిస్తున్నాయి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపునకు నిదర్శనంగా నిలిచాయి. ఆ స్ఫూర్తిని ప్రస్తుతం ప్రభుత్వం కొనసాగిస్తే మరింత సౌకర్యవంతంగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు మార్గం సుగమమం చేస్తున్నాయి.

- విద్యుత్ బస్సులతో ఆర్టీసీకి ఆదాయం
- నేటితో కరెంట్ సర్వీసులకు మూడు వసంతాలు
- ముందుచూపుతో శ్రీకారం చుట్టిన అప్పటి సీఎం వైఎస్ జగన్



విద్యుత్ బస్సులను ప్రారంభిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

రాబడి ఇలా..

2022–23	:	రూ.7.40 కోట్లు
2023–24	:	రూ.56.61 కోట్లు
2024–25	:	రూ.61.96 కోట్లు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీకి ఆదాయం.. పర్యావరణ పర్యావరణ హితమే లక్ష్యంగా 2022 సెప్టెంబర్ 27వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ బస్సులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో తొలిసారి తిరుపతిలోని అలిపిరి డిపోకు 100 విద్యుత్ బస్సులను అందించారు. తిరుపతి– తిరుమలతోపాటు రేణిగుంట ఎయిర్‌పోర్టు, మదనపల్లె, కడప, నెల్లూరుకు ఈ సర్వీసులు నడుస్తున్నాయి. ఈ బస్సుల్లో ఏసీ సైతం ఉండడంతో ప్రయాణికులు సైతం వీటిలో రాకపోకలకు సాగించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ మూడేళ్లలో విద్యుత్ సర్వీసుల ద్వారా ఆర్టీసీకి రూ.125.97 కోట్ల రాబడి వచ్చింది.ఈ క్రమంలోనే మరో 200 విద్యుత్ బస్సులను ఏర్పాటు చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే కూటమి సర్కారు రావడంతో కరెంట్ బస్సుల పెంపు ప్రక్రియ అటకెక్కింది.



విద్యుత్ బస్సులు

చార్జింగ్ పాయింట్లు

గత సర్కార్‌లోనే విద్యుత్ బస్సులకు అవసరమైన చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా అలిపిరి డిపోలో 46 , తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో 11 , గ్యారేజ్‌లో నాలుగు చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు.


కొత్త బస్సుల ఊసేలేదు..

ఎన్నికల సమయంలో తిరుపతి జిల్లాకు 300 విద్యుత్ బస్సులను తీసుకువస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ప్రధానంగా తిరుమలకు పూర్తిగా విద్యుత్ బస్సులను మాత్రమే తిప్పుతామని ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చి 17 నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు ఆ ఊసేలేదు.

తూతూమంత్రంగా నిర్వహణ

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్ బస్సుల నిర్వహణ తూతూమంత్రంగా మారినట్లు విమర్శలున్నాయి. ప్రధానంగా విద్యుత్ బస్సుల డ్రైవర్లకు సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడంతో వారు పదేపదే ధర్నాలు, నిరసనలు చేపడుతున్నారు. అంతేకాకుండా 100 విద్యుత్ బస్సుల్లో 10శాతం బస్సులు నిత్యం మరమ్మతులతో మూలనపడుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇబ్బంది లేకుండా నడుపుతున్నాం



ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సర్వీసులను నడుపుతున్నాం. అలిపిరి డిపో నుంచే 100 విద్యుత్ బస్సులు నడుస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తీసుకువచ్చిన బస్సులన్నీ రన్నింగ్‌లోనే ఉన్నాయి. రాబడి తగ్గకుండా వస్తోంది.

– హరిబాబు, డీఎం, అలిపిరి

సిరులతల్లిగా శక్తిస్వరూపిణి



నందివాహనంపై ఎల్లమ్మ



కళాత్మక రూపంలో అమ్మవారు



ధనలక్ష్మీగా కన్యకాపరమేశ్వరి

తిరుపతి కల్చరల్ : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తవీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరీదేవి ధనలక్ష్మిగా, బొంతాలమ్మ లక్ష్మీదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు.

తిరుపతి రూరల్ : ఎల్ఎస్‌నగర్ వద్దనున్న శక్తి చాముండేశ్వరి అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బీజేపీ నేత నవీన్‌కుమార్ రెడ్డి సేవించుకున్నారు.ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భాకరాపేట: కట్టమీద గంగమ్మ తల్లి శ్రీమహాలక్ష్మిగా ప్రత్యేక పూజలు అందుకున్నారు.

రామచంద్రాపురం: రాయలచెరువు సమీపంలోని శ్రీ శక్తిపీఠంలో కమలాత్మక దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతులు నూతన భవనం ప్రారంభించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

చంద్రగిరి: మూస్థాన ఎల్లమ్మదేవి అన్నపూర్ణ అవతారంలో నంది వాహనంపై కొలువుతీరి భక్తులను కటాక్షించారు. ఆలయ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఈఓ మమత పాల్గొన్నారు. ఆర్ఎఫ్ రోడ్డులోని పుట్టాలమ్మ ఆలయంలో అనుబంధంగా వెలసిన సంతోషిమాత అమ్మవారు లలితా దేవిగా భక్తులను అనుగ్రహించారు.

అమ్మవారికి గొడుగులు బహూకరణ



గొడుగులు అందిస్తున్న గోపాల్ జీ

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతి అమ్మవారికి చెన్నైకి చెందిన భక్త బృందం రెండు గొడుగులను బహూకరించింది. హిందూ ధర్మార్థ సమితి ట్రస్ట్ వారు శుక్రవారం రాత్రి ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్‌కు రెండు గొడుగులను అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు గోపాల్ జీ, సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

బాలకృష్ణ తీరు ఆక్షేపణీయం



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి పక్కన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట:దేవాలయం లాంటి అసెంబ్లీలో అన్‌పార్లమెంట్ లాంగ్వేజ్‌ను సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ ఉపయోగించడం ఆక్షేపణీయమని తిరుపతి పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మద్దిల గురుమూర్తి ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, సినీనటుడు చిరంజీవిపై బాలకృష్ణ అనుచితంగా మాట్లాడటం ఎంతమాత్రమూ సరికాదన్నారు. శుక్రవారం రాత్రి రేణిగుంట రైల్వేస్టేషన్‌లో తిరుపతి ఎంపీ మాట్లాడారు, ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో హుందాగా వ్యవహరించాలని, విజ్ఞతతో మాట్లాడాలన్నారు. ఒకరిని కించపరిచేలా, తూలనాడటం, నోరు పారేసుకోవడం కాదన్నారు. ఇలాగే కొనసాగితే అసెంబ్లీ, పార్లమెంటు వ్యవస్థలు దిగజారిపోతాయన్నారు. వాస్తవమేమిటో తెలుసు కాబట్టే చిరంజీవి ప్రతిస్పందించారని, మాజీ ముఖ్యమంత్రి ఎవరినీ అవమానించలేదని స్పష్టం చేశారు..

నేటి వాహన సేవలు

తిరుమల : శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీమలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై మాడ వీధుల్లో విహరించనున్నారు. రాత్రి సర్వభూపాల వాహనంపై భక్తులకు అభయమివ్వనున్నారు.

భక్తుల కోసం 'ఫ్యాక్ట్‌చెక్ టీటీడీ'

తిరుమల : టీటీడీపై అసత్య ప్రచారాలను తిప్పికొట్టేందుకు ఫ్యాక్ట్‌చెక్ టీటీడీ పేరుతో సోషల్ మీడియా అకౌంట్లను ప్రారంభించారు. శుక్రవారం ఈ మేరకు టీటీడీ విజిలెన్స్, ఐటీ, పోలీసు విభాగం సంయుక్త పర్యవేక్షణలో వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌లో అకౌంట్లు తెరిచారు. వీటి ద్వారా భక్తులు టీటీడీపై వచ్చే వార్తలను తనిఖీ చేసుకునే అవకాశం కల్పించారు. ఈ క్రమంలోనే త్వరలో సైబర్ సెక్యూరిటీ విభాగం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సబీనా షారన్‌కు డాక్టరేట్



తిరుపతి రూరల్ : పద్మావతి మహిళా వర్సిటీ పరిశోధక విద్యార్థిని సబీనా షారన్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి మార్గదర్శకత్వంలో 'ఏ స్టడీ ఆన్ వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ఆఫ్ ఉమెన్ టీచర్స్ ఇన్ ది డిగ్రీ కాలేజెస్ ఆఫ్ బెంగళూరు సిటీ ఇన్ కర్ణాటక'అనే అంశంపై ఆమ పరిశోధన పత్రాలు సమర్పించారు.

కన్స్యూమర్ స్టోర్స్ చైర్మన్‌గా శివప్రసాద్



తిరుపతి సిటీ : ఎస్వీయూ క్యాంపస్‌లోని కన్స్యూమర్ కో–ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ చైర్మన్‌గా కె.శివప్రసాద్ నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా కె.నాగరాజు, టి.విజయసారథిని నియమిస్తున్నట్లు పేర్కొంది.

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా రెడ్డి శేఖర్



చంద్రగిరి : శ్రీ వేకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ ఎం.రెడ్డి శేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ బోధన, పరిశోధనా రంగాల్లో కళాశాలను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

'యువతరంగ్'కు ఆహ్వానం



మంత్రికి ఆహ్వానపత్రికను అందిస్తున్న వివేక్

తిరుపతి సిటీ : ఎస్వీయూలో అక్టోబర్ 16 నుంచి 18వ తేదీ వరకు యువతరంగ్–2025 పేరిట నిర్వహించనున్న సాంస్కృతిక మహోత్సవానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని వర్సిటీ అధికారులు ఆహ్వానించారు. శుక్రవారం ఈ మేరకు అమరావతిలో మంత్రిని డాక్టర్ పత్తిపాటి వివేక్, అధ్యాపకులు కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు అవసరం



ఆయుధ పూజలో నేతలు

చంద్రగిరి : ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు అవసరమని ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణాద్రి ఆస్పత్రి సమీపంలోని వరహాల గంగమ్మ తల్లి ఆటోస్టాండ్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. నేతలు కేతారి రాధాకృష్ణ, ఎస్.శివ, పురుషోత్తం రెడ్డి, రవి, ప్రమీల, నాగభూషణం, బాలకృష్ణ, ఖాదర్‌బాషా, హరనాథ్ రెడ్డి, మురళి పాల్గొన్నారు.

చెర్లోపల్లె సర్పంచ్‌గా చంద్రశేఖర్



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖరం

తిరుపతి రూరల్ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ సర్పంచ్‌గా కూరగాయల చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్ బొల్లినేని సుభాషిణి మృతి చెందడంతో ఆమె స్థానంలో చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్ సుభాషిణి భర్త బొల్లినేని శుభగిరినాయుడు, టీడీపీ నేత శ్రీధర్‌నాయుడు అభినందనలు తెలిపారు.

దేవదేవేరులకు ఊంజల్ సేవ





సారె తీసుకువచ్చిన తుమ్మలగుంట వాసులతో మోహిత్‌రెడ్డి

మనసారె సమర్పయామి

తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం మూడో రోజున సింహ, ముత్యపు పందిర వాహనాలపై దేవదేవేరులు దర్శనమిచ్చారు. తుమ్మలగుంటతోపాటు, తిరుచానూరు, ఎర్రావారిపాళెం మండలాలకు చెందిన భక్తులు సంప్రదాయబద్ధంగా సారె తీసుకువచ్చి కల్యాణ వెంకన్నకు సమర్పించారు. ఆలయం తరఫున ధర్మకర్తల మండలి సభ్యుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్‌రెడ్డి వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

– తిరుపతి రూరల్





తిరుచానూరు, ఎర్రావారిపాళెం వాసులతో..